# రేపటి కట్నం

డి. వి. రమణారావు

"**ఏమండీ** ... ఒకసారిలా వస్తారా?" మాణిక్యాంబ తలుపు చాటునుండి గుర్నాథాన్ని కేకేసింది.

"ఏమిటీ?" అవతల కెళ్ళబోయిన వాడల్లా భార్య పిలుపుకి విసుక్కొంటూ వెనక్కి తిరిగాడు.

"అది కాదండీ ..." మాణిక్యాంబ తాను చెప్ప వలుచుకొన్న దానికి మాటలు కూడబెట్టుకోసాగింది.

"ఇదుగో చూడు ... అవత లున్నవాళ్ళు పెద్ద మనుషులు. ఈ రోజుల్లో 'అందాన్ని' చూసి 'కానీ' కట్నం లేకుండా పెళ్ళి చేసుకునే విశాల హృదయు లెవరుంటారు? మన అమ్మాయి అదృష్టం కొద్దీ అందమైన వాడూ పెద్ద హోదాలో ఉన్నవాడూ పైగా రచయిత కూడానట! అయినా ఎంతమంది రచయితలు తాము వ్రాసినట్లు నడుచుకొంటు న్నారు? కాబట్టి నీ వెధవ అనుమానాలతో నా బుర్ర వేడెక్కించకు. అడగదలుచుకుందేమిటో త్వరగా అడుగు. అవతల నిశ్చితార్థం చేసుకునే వేళవు తోంది ...!"

"అంతేలెండి ... కూతుళ్ళని తండ్రు లెప్పుడూ గుండెలమీద కొలిమే అనుకొంటారు... వాళ్ళని కనిపెంచిన తల్లులకి తెలుస్తుంది బాధ" మాణిక్యాంబ మంద్రస్వరాన మెల్లిగా అంది.


గుర్నాథానికి భార్య అంత బాధపడ్డానికి గల కారణం ఎంత ఆలోచించినా బోధపడలేదు.

"ఇదేమిటి, మాణిక్యం? కూతురి జీవితం సుఖ వంత మవుతుందని సంతోషించాల్సిన ఈ తరుణంలో .. అందులోనూ కన్నతల్లివి ... అలా మాట్లాడతా వేమిటి?" గుర్నాథం తన ఆశ్చర్యాన్ని, ముంచుకొస్తున్న ఆవేశాన్ని ఆ మాటల్లో తన శక్తి కొద్దీ పలికించాడు.

"అది కాదండీ ... అందమైనవాడు, రచయిత, పైగా ఎద్ద హోదాలో ఉన్నవాడు ... మన సావిత్రి అతిలోక సౌందర్యవతే కానివ్వండి ... 'కానీ' కట్నం లేకుండా చేసుకొంటా నన్నాడంటే ... అతని కేమైనా ..." మాణిక్యాంబ ఆగింది.

-"ప్చ్! అతని కేమైనా ...!" గుర్నాథం రెట్టించాడు.

"మీ కలాగే ఉంటుంది ... ఆ తరవా తేమైనా అయితే అనుభవించేది నేను ... అతనికి గుంభనమైన జబ్బులూ అవీ ఏమైనా ఉన్నాయేమో ... రేపటి నుండి కానీ కట్నం లేకుండా చేసుకొన్నా న్నిన్ను అని వేధించుకు తినడం- జీవితాంతం అది పడే యాతన ... ఎన్ని కథల్లో చదవటంలేదు మనం ఇవన్నీ ?" మాణిక్యాంబ మాట మధ్యలోనే ఆగింది.




"ఛ! నీ కసలు నోరెలా వచ్చిందే అలా మాట్లాడ్డానికి? రోజూ వెళ్ళే దారేకదా, కళ్ళు మూసుకుని పోతా నీవేళ అనుకొని, అదృష్టాన్ని కాలదన్నుకొన్నాట్ట వెనకటికి నీలాంటి వాడే ఒకడు ... ఎంత తల్లివైతే మాత్రం? తండ్రిగా నా కూతురు సుఖ సంతోషాలు నా కక్కరలేదా? అసలైనా ఆ కుర్రాణ్ణి అతని ప్రవర్తనని చూస్తే అర్థం కావటం లేదే అత నెంత సంస్కార వంతుడో? కాఫీ ఇస్తే వద్దని పాలివ్వండని ఆడిగించుకు మరీ తాగాడే ... అంత కలివిడి ఉన్న ఆణిముత్యం లాంటి కుర్రాణ్ణి అనడానికి నీకు మనసెలా ఒప్పిందే? అందుకేనే ... నీలాంటి అనుమాన పిశాచాలు ప్రతి ఇంటా ఏదో ఒక రూపంలో ఉండబట్టే చాలామంది అమాయకురాళ్ళు కన్నెలుగానే అణగారిపోతున్నారు ...!"

గుర్నాథం భార్య మాటలకి చాలా ఫీలయ్యాడు... అతని కా క్షణంలో ఆమె తనతో ముప్ఫయి సంవత్సరాలు సంసారం చేసిన తన భార్యా, లేక తన కూతురి పాలిట దాపురించిన శనిగ్రహమా?' అన్నంత కోపం వచ్చింది.


కొన్ని క్షణాలు ఆగి: మనసు కుదట పడ్డాక శాంతంగా అన్నాడు గుర్నాథం: "మాణిక్యం ... పిచ్చి పిచ్చి వూహాలు పెట్టుకొని మనసు పాడు చేసుకోకు ... ఇన్ని సంబంధాలు తప్పిపోయిన దాన్ని కోరి వెతుక్కుంటూ సిరి తలుపు తట్టింది ... అబ్బాయి కట్నం అడక్క పోతేనేం. మనకేం పదిమంది సంతానం ఉన్నారా? కొద్దో ... గొప్పో ఉన్నదంతా దానిదేగా? కాస్త స్తిమితంగా ఆలోచించుకో మనసులో. నే వెళ్ళి ...!" అంటూ మాటని సగంలోనే ఆపేసి మళ్ళీ ముఖాన మందహాసపు పౌడరు పులుము కొని హాల్లో కొచ్చాడు.

"చూడండి, బావగారూ మా ఆవిడ చాదస్తం? కనీసం అబ్బాయి అలక పాన్పైనా ఎక్కి తీరాలని రొద పెడుతోంది పూరికే?" గుర్నాథం మాటల కందరూ నవ్వుకొన్నారు. "ఇక మీదే ఆలస్యం, బావగారూ ... తాంబూలాలు పుచ్చేసుకొని దగ్గర్లో ముహూర్తం ఏదైనా ఉంటే పెట్టేసుకుందాం...!" రాఘవరావు వాచీకేసి చూసుకొంటూ అన్నారు.

"నువ్వూరుకో, నాన్నా ... గుర్నాథం గారూ... మీ కభ్యంతరం లేకపోతే సావిత్రిగారితో ఏకాంతంగా కొంచెంసేపు మాట్లాడాలని ఉంది!" మధుమూర్తి సావిత్రి కేసి రెప్పవాల్చకుండా చూస్తూ అర్థోక్తిగా అన్నాడు.

"ఓ దానికేం భాగ్యం, బాబూ? అలాగే ... ఈ కాలం పిల్లలంతే నండీ, రాఘవరావుగారూ. ఒంటరిగా తమ భావాలు చర్చించుకోవా లంటారు. వాళ్ళ ఆనం దానికి మన మెందుకు అవరోధం కావాలి?" గుర్నాథం ఏదో చెపుతూనే ఉన్నాడు ...

కానీ రాఘవరావు దృష్టి అటు లేదు... కొడుకు 'కొంచెంసేపు మాట్లాడాలని ఉంది' అన్నప్పుడే ఆయన మనసు వికల మైంది. అంతవరకూ ఆయనలో ఉన్న కుర్రతనం స్థానే ఆయన వయస్సు తెచ్చిన వార్ధక్యపు నిస్సహాయత చోటు చేసుకుంది ఆయన మోహంలో. నిర్లిప్తంగా అవతలి గదిలోకి నడిచా రాయన.



''చూడండి, సావిత్రిగారూ. . . నేను మీకు నచ్చానా?'' మధుమూర్తి సావిత్రి కళ్ళలోకి చూస్తూ అడిగాడు. ఆమె ఆ ప్రశ్నకు సిగ్గుల మొగ్గే అయింది.

''నాకు మీరు నచ్చిందీ, లేనిదీ మిమ్మల్నా ప్రశ్న అడగడంతోటే మీ కర్థమైందనుకుంటాను.'' మధుమూర్తి కొంటెగా అన్నాడు.

సావిత్రి ఒకసారి తల ఎత్తి అతన్ని మనసారా చూసి కళ్ళు దించుకుంది.

''మీ ఆ చూపే అంగీకారమనుకోనా? లేకపోతే, రచయితలు అమాత్రం గ్రహించలేరా? అని ఎత్తిపొడుపా?'' ఆమె చేత ఎలాగైనా మాట్లాడించా లన్న అతని ప్రయత్నం ఫలించింది.

''నోటితో చెప్పలేని విషయాలు నా కళ్ళే మీకు చెప్పాయిగా? మీరు కథలు వ్రాస్తారుగా— అంతకన్నా అవసరం లేదనుకున్నాను'' సావిత్రి కంఠం కోయిల పాడినట్టుగానే ఉంది.

''మాటకారులే. నోటి ముత్యాలు రాలిపోతాయనా అంత ముద్దు ముద్దుగా మాట్లాడారు?''

''సంసారం చేస్తే ఎలాగో రాలక తప్పదు. ఇప్పుడే ఎందుకనీ!'' అంటూ కిలకిల మన్న ఆమెతో తానూ శ్రుతి కలిపాడు మధుమూర్తి.

''కానీ, సావిత్రిగారూ...'' మధుమూర్తి కంఠం లోని ఆ ఆకస్మిక గాంభీర్యానికి సావిత్రి ఉలిక్కి పడి అతని వంక చూసింది.

''మా నాన్న నా గురించి చెప్పవలసినవన్నీ చెప్పినా, ఆయన నా గురించి మీకు చెప్పని ఒక చేదు నిజం ఉంది. ఆయన నన్ను కన్నతండ్రిగా మమకారం వల్ల ఆ నిజాన్ని కప్పి పుచ్చినా ఆయన కన్న కొడుగ్గా నలుగురికీ నా రచనల ద్వారా సందేశాలిస్తున్న నేనైనా చెప్పి తీరాలి—అది నా ధర్మం!''

మధుమూర్తి ఒక క్షణం ఆగి పరీక్షగా సావిత్రి కళ్ళలోకి చూశాడు. ఆమె అత నేం చెపుతాడో అన్న ఆందోళనతో కనురెప్పల్ని అల్లల్లాడించింది.

''చూడు, సావిత్రీ...సారీ! నా కన్నా చిన్నదానివని ఇలా సంబోధిస్తున్నాను!''

మధుమూర్తి వంక ఫరవా లేదన్నట్లుగా చూసింది సావిత్రి.

''ప్రతి మనిషికీ దేవుడు తన హద్దును, అంతరాన్ని మరిచిపోకుండా, తన కన్నా గొప్పవారు లేడని అహంక రించకుండా నే ననే వాణ్ణి ఒకణ్ణే ఉన్నానంటూ గుర్తు చేయడానికి కావాలనే ఏదో ఒక లోపాన్ని కల్పిస్తుంటాడు!''

ఏం వినాల్సి వస్తుందోనని సావిత్రి గుండె వేగంగా కొట్టుకుంది.

''అలాగే. నా కన్నీ ఇచ్చిన భగవంతుడు 'అమ్మా' అనే అమృత వాక్కును నోరారా స్మరించే అదృష్టాన్ని నాలుగేళ్ళప్పుడే లేకుండా చేశాడు. ఈ రెస్పెక్ట్‌లో నువ్వు నన్ను తల్లిలా కూడా చూసుకోవాలి సుమా

ఆంధ్రుల
(ఆరాధ్య రచయిత్రి)
శ్రీమతి యద్దనపూడి
సులోచనారాణి
నూతన సంవత్సర కానుక...
అతను న్యాయవాది; ఆమె అపరాధి.
ఆమెకు రక్షణ ఇవ్వబోతే లోకం అన్యాయం
అంది. విధి చిత్రంగా దోబూచులాడిన
జీవితాల అద్భుత చిత్రీకరణే—
ప్రేమసింహాసనం
వెల: 15.00

మీ దగ్గరలో వున్న బుక్ షాపుల్లో అడగండి!
లేదా — పుస్తకం ధరలో 1 రూపాయి తగ్గించి M.O. చేయండి
ఆ రూపాయికే వి.పి.లో పంపగలం!

నవసాహితి బుక్ హౌస్
ఏలూరు రోడ్,
విజయవాడ-520002


అని చెప్పడం కాదు నా ఉద్దేశం. తల్లి తల్లే. ఆ తల్లిని మరే స్త్రీ మరిపించలేదు. అఫ్‌కోర్స్! నీ పిల్లలకి నువ్వు తల్లి ప్రేమ అందించగలవు అది వేరే విషయం! ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, సాధారణంగా ప్రతి స్త్రీ తన భర్త పెద్ద హోదాలో ఉండాలని, అందంగా ఉండాలనీ—ఆ రెండూ లేక పోయినా కనీసం తనను అర్థం చేసుకునే మనిషై ఉండాలని కోరుకుంటుంది. అయితే, నా విషయంలో అది రివర్స్ అయింది!'' మధుమూర్తి ఊపిరి పీల్చుకున్నాడు.

''నా వయసిప్పుడు 30 సంవత్సరాలు. నా కిది పదో పెళ్ళి చూపు!''

సావిత్రి దిగ్గున తల ఎత్తి అతని వంక చూసింది.

మధుమూర్తి తాపీగా సిగరెట్ అంటించుకుని చెప్పసాగాడు: ''ఎక్కడైనా ఆడపిల్ల నచ్చలేదన్న సాకుతో సాధారణంగా మగ పిల్లల తలిదండ్రులు కట్నం విషయంలోనో, లాంఛనాల విషయంలోనో అసంతృప్తి కలిగితే తప్పించుకుంటుంటారు. కానీ,ఇక్కడ ఆడపిల్లలే నేను నచ్చలేదని తిరస్కరించారు!''' మధుమూర్తి ముఖాన కొద్దిగా మందహాసం పొడ చూపింది.

''మిమ్మల్నా!?'' సావిత్రి నమ్మలేనట్లు చూసింది.

''అవును! ఓ అయామ్ సారీ. ఇంతకీ అసలు నా కున్న లోపమేమిటో నీకు చెప్పనే లేదు కదూ? నా కున్న కంప్లెయింటు 'రెటినైటిస్ పిగ్మెంటోసా!' అంటే, రేచీకటనీ. దానంతటది పోవాలే కానీ, దానికి క్యూర్ లేదని కళ్ళ డాక్టర్లు చెప్పారు.'' మధుమూర్తి ఆగి సావిత్రి మనసులోని భావాల్ని చదవడానికి ప్రయత్నం చేశాడు.

''కనీసం, నా రచనల ద్వారా పాఠకులకి నే నిచ్చే సందేశాల దృష్ట్యా చూస్తే హండ్రెడ్ పెర్‌సెంట్ ఆచరించకపోయినా, ఎట్‌లీస్ట్ ఫిఫ్టీ పెర్‌సెంటైనా ఆచరించి చూపాలికదా? లేకపోతే నా లోని రచయిత నన్ను ఘోష పెడతాడు. నా వ్యక్తిత్వాన్ని నిలదీసి ప్రశ్నిస్తాడు. అందుకే ఇది పదో పెళ్ళి చూపైంది. కాకుంటే నలుగురు పిల్లల తండ్రినై ఉండేవాణ్ణి! కాబట్టి బాగా ఆలోచించుకుని మరీ నిర్ణయానికి రా! ఇది 'నీ—నా' ఇరువురి జీవిత సమస్య. నేను నీకు తోడు కావడం మాట అటుంచి, నువ్వే నాకు తోడవాలి — వెలుగులోకి నన్ను నడిపించాలి. వస్తా!'' మధుమూర్తి అవతలు కెళ్ళిపోయాడు!

సావిత్రి చాలా సేపటి వరకూ మనిషి కాలేక పోయింది. తల్లి వచ్చి కుదిపే వరకూ స్థాణువై కూర్చుంది.

• • •

''నీ కిక ఈ జన్మలో పెళ్ళి కాదురా. ఏం, రేచీకటేమైనా బ్లడ్ కాన్సరా? ఆ విషయం దాచినంత మాత్రాన నష్టమేమిటి? వీడో రచయిత. . . అది చెప్పకపోతే వీడి బోడి వ్యక్తిత్వానికో లోపం. నీ ఆదర్శం అందల మెక్కినట్లే ఉంది. నువ్వు మంచి మనసుతో చెప్పినా అర్థం చేసుకునేందుకు అవతల వాళ్ళు కుండొద్దా బ్రాడ్ మైండూ?, బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికి రాదురా! ఎన్నాళ్ళిలా చేతులు కాల్చుకుంటావు?''


## సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

విశ్రాంతి సమయంలో ఇంట్లోనే వుండి అయా పనిముట్లను సరిచేసుకునే వారికి, విద్యా సంస్థలలో చేరి విద్యనభ్యసించేవారికి, వివిధ సంస్థలలో పని చేసుకునేవారికి అతి సులభముగా అర్థమయేటట్లు చిత్రాలతో వివరించివున్నాము. ప్రతి ఇంటా వుండి అందరికీ ఉపయోగపడే ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | 3-50 | వాల్వు రేడియో రిపేరింగ్ | 10-00 |
| ట్రాన్సిస్టర్ రేడియో | 3-50 | టేప్ రికార్డర్ | 5-25 |
| హౌస్ వైరింగ్ | 5-75 | టి.వి. మెకానిజం | 5-25 |
| మోటార్ రీవైండింగ్ | 5-25 | మోటార్ మెకానిజం | 6-00 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue
Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014

తండ్రిని కాసేపు ఆయాసపడనిచ్చి—"వంటమనిషుంటే చేతులు కాల్చుకుంటున్నానంటా వేమిటి, నాన్నా?" మధుమూర్తి నవ్వుతూ టాపిక్ మార్చాలని చూశాడు.

"అయితే, ఇక పెళ్ళి చేసుకోనన్న మాట" రాఘవరావుకు కొడుకు ధోరణికి విసుగూ, కోపం రెట్టింపయ్యాయి. "నువ్వు చూపించిన ప్రతి పెళ్ళి చూపుకీ వెళ్తూనే ఉన్నాంగా?" మధుమూర్తి గొంతులో విసుగు ధ్వనించింది.

"ఆఁ-వెళ్తున్నాం... నువ్వక్కడ నా దుంప తగలేస్తున్నావ్ ... ఒరేయ్ ... మధూ ... నా మాట వినరా...?" రాఘవరావు ప్రాధేయపడ్డాడు.

"క్షమించు, నాన్నా ...! ఈ రోజు మభ్యపెట్టి పెళ్ళి చేసుకొన్నా ఆ తరవాత మిగిలేవి స్పర్ధలూ ... కలతలూ ... ఇవే!" మధుమూర్తి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

* * * *

"ఈ జన్మకి నా నొసట బ్రహ్మచారిగా ఉండమనే భగవంతుడు వ్రాశాడు నాన్నా! పెళ్ళవుతుందన్న నమ్మకం నాకు లేదు... దయచేసి ఇక ముందా మాట నా ఎదుట ఎత్తద్దు!" మధుమూర్తి విసుగ్గా అన్నాడు, మళ్ళీ తండ్రి తన పాత ధోరణి మొదలెట్టడంతో.

"ఈ ఒక్కసారికి నా మాట విను ... ప్లీజ్ ... చూడరా—పిల్ల కుందనపు బొమ్మలా ఉంది... పైగా జర్నలిజం చదివిందట ... నీకు ఈడు—జోడు బాగుంటుంది ... నా మాట కాదనకు. అక్కడ మళ్ళీ నీ పోడి చెప్పక ... ఈ రోజుల్లో ఎంతమంది తమకున్న దారుణమైన లోపాల్ని కప్పిపుచ్చుకోటం లేదూ?" రాఘవరావు కొడుకు గడ్డం పట్టుకున్నాడు. ఇక ఆ ముసలాయన్ని మరీ బెట్టు చేసి కష్టపెట్టడంలో అర్థం లేదనిపించింది మధుమూర్తికి.

ఇక విసిగిపోయాడు తను ... తను చెప్పిందెవ్వరూ సహృదయంతో అర్థం చేసుకోనప్పుడు ఆ విషయం చెప్పి అనవసరంగా తన జీవితం పాడు చేసుకోవడంలో అర్థం లేదు ... తనకూ ఒక తోడు కావాలి ... ఒంటరిగా జీవించలేక తను ... తన ఆదర్శం ఆదర్శంగానే మిగిలిపోవాలి కాబోలు ... నవ్వుకొన్నాడు తనలో తాను మధుమూర్తి.


* * * *

"అమ్మాయి జర్నలిజంలో గోల్డ్ మెడలిస్టండి.. బెనర్జీ గారని పేరు వినే ఉంటారు ... అయినా నా పిచ్చిగానీ మీది అదే ఫీల్డుగదా? మీకు తెలియకపోవడమేమిటి? అదే-ఇండియన్ ప్రెస్స్ ఎడిటర్... ప్రస్తుతం ఆయన దగ్గర—అయ్ మీన్ ఇండియన్ ప్రెస్స్‌లో జర్నలిస్టుగా చేస్తోంది ...!" రంగనాథం గారి మాట పూర్తవలేదు.

"మీరు చెప్పవలసిందయిందా? ఇక నన్నాయనతో కాస్సేపు మాట్లాడనివ్వండి నాన్నా!" మాలతి నవ్వుతూ తండ్రిని చూసింది.

"ఊఁ! అలాగే మాట్లాడు... ఇదిగో—ఇదేనండి వరస ... ఈ జర్నలిస్టులంతా ఇంతే ... పెళ్ళి చూపులు గూడా ఇంటర్వ్యూ ధోరణే ...!"

రెండు క్షణాల అనంతరం ఆ గదిలో ఒక జర్నలిస్టు ... రచయిత మాత్రం మిగిలారు.




మధుమూర్తికి మాలతిని చూడగానే కళ్ళు చెదిరిపోయాయి. తన కింకా పెళ్ళి కాకుండా ఉండడానికి కారణం ఈమెతోనే తన జీవితం ముడిపడాలని ఆ విధాత తన నుదుట వ్రాయబడ్డట్టేనేమో నని అనుకొన్నా డా క్షణంలో మధుమూర్తి.

చూపుల కొచ్చినప్పట్నుంచీ మధుమూర్తి ఒక్క ముక్క మాట్లాడలేదు. తానే పెళ్ళికూతుర్నైనట్టు ఆమె పెళ్ళికొడుకైనట్లు ఫీలయ్యాడో క్షణం! అందుక్కారణం నఖశిఖ పర్యంతం అతణ్ణి తీక్ష్ణంగా చూసిన ఆమె సునిశితమైన దృక్కులే!

మధుమూర్తి జీవితంలో అన్నీ రివర్సే ...! అది వరకు పెళ్ళికూతురితో తాను కాస్సేపు మాట్లాడతాననేవాడు ... అందుకు భిన్నంగా ఆమె తనతో ఏకాంతంగా మాట్లాడాలన్న ఉద్దేశాన్ని వెలిబుచ్చింది.

ఇది మధుమూర్తికి ఆశ్చర్యం కలిగించిన విషయాల్లో ఒకటి. బహుశా ఆమె జర్నలిస్టు కావడమే ఆమె కనబరచిన ఆ చొరవకు కారణమై ఉండవచ్చనుకొన్నాడు మధుమూర్తి.

"కొంపదీసి మీరు మూగవారు కాదుగదా?" ఎంతసేపట్నుంచో తనకేసి రెప్ప వాల్చకుండా చూస్తూ ఆలోచిస్తున్న మధుమూర్తిని చూసి కిల కిలా నవ్వుతూ ప్రశ్నించింది మాలతి.

"మీ సమక్షంలో మూగతనం నన్ను వరించినా నే బాధపడను. ఎందుకంటే మీ గమ్యం నా గమ్యం ఒకటే కాబట్టి. నా బదులుకూడా మీరే మాట్లాడగల-మూగవాణ్ణికూడా మాటలతో మాట్లాడించగల నేర్పు మీలో ఉంది కాబట్టి." మధుమూర్తి నవ్వుతూ పెదవి విప్పారు.

"మొత్తానికి రచయితనిపించారు. అవునూ—ఇది ఏ నవల్లో డైలాగబ్బా... ఆఁ-అన్నట్టు, మీ నవల్స్ కన్నా కథలే ఇష్టం నాకు. ఎందుకంటే నవల నవలనిపించుకోవాలని పొడిగించినట్టుంటుంది గానీ, కథ మాత్రం ముక్కుసూటిగా గుండెకు హత్తుకునేటట్లుగా చక్కగా చెబుతారు. దట్స్ వై ఐ హావ్ ఎడ్మిరేషన్ ఆన్ యువర్ స్టోరీస్ మోర్ దెన్ యువర్ నావెల్స్!" మాలతి అంది.

"థేంక్స్! మీలా కన్‌స్ట్రక్టివ్ క్రిటిసిజమ్ చేసేవారంటే నాకూ ఇష్టమే. ఒక రచన బాగులేదంటే సరిపోదు. అది ఎందుకు బాగులేదో సద్విమర్శ చేసి చూపాలి. ఒక విధంగా చూస్తే రచయితకు కనిపించని ఎన్నో లోపాలు చదివే పాఠకుడికి కనిపిస్తాయి. అయితే, దాని కో రూపు కల్పించి సహేతుకంగా సమీక్షించినప్పుడే సద్విమర్శ అవుతుంది!" మధుమూర్తి ఉత్సాహంగా అన్నాడు.

మాలతి అతని ఆర్గ్యుమెంట్‌ని ఉత్సుకతతో విని అభినందన పూర్వకంగా చూసింది.

మధుమూర్తికి అకస్మాత్తుగా సిగరెట్ సంగతి జ్ఞాపకం వచ్చింది. 'బాప్‌రే ... తను మూడు గంటల నుంచీ ఒక్క సిగరెట్టు కూడా తాగలేదు.' ఇది గుర్తుకు రాగానే సిగరెట్ పాకెట్ తెరవబోయినవాడల్లా ఆగాడు ... "ఎనీ అబ్జక్షన్?" అన్నాడు.

"ఎస్ .. డెఫినిట్లీ ... బట్ ఇన్ కేస్ ఉయ్ మారీ ... ఇట్ విల్ బీ ది లాస్ట్ చాన్స్ ఫర్ యూ టు స్మోక్! ఎండ్ ఐ ట్రూలీ సే దట్ ఇటీస్ ది ఫస్ట్ హేబిట్ ఐ సా ఇన్ యూ విచ్ అయ్ నెవ్వర్ లైక్!" మాలతి గంభీరంగా అంది.

"ఏం ... ఎందుకలా అన్నారు ... ఇన్ కేస్ ఉయ్ మారీ అంటే ... అంటే ... మీ కిష్టంలేదా నన్ను చేసుకోవడం?" మధుమూర్తి హృదయాంతరాళంలోంచి వెలువడ్డ ఆ మాటలు అంతవరకూ అతని పెదవుల మధ్య నున్న సిగరెట్‌ని క్రింద పడవేశాయి.

"నో! నో! నాటెటాల్! నేను చెప్పే విషయాలు మీకు ఆశ్చర్యం కలిగించనూ వచ్చు ... కలిగించకపోనూ వచ్చు. కానీ ... ఒక్క మాట. నేను చెప్పిన విషయాలు విన్న తర్వాత యూ షుడ్ నాట్ సే నో ... ది థింగ్ ఈజ్ దట్ ఐ హావ్ లవ్డ్ యూ బిఫోర్ ఉయ్ మెట్ ... సారీ ... నేను చేసింది ఇంగ్లీషు జర్నలిజం ... కాబట్టి ఇంగ్లీషు పదా

తెక్కువగా దొర్లుతుంటాయి. ఎనీ అబ్జక్షన్?''

మధుమూర్తి, మాలతి ఒకేసారి నవ్వుకున్నారు ఆ మాటలకి.

''ఇంతకీ మీరు అసలు విషయం చెప్పనేలేదు?'' మధుమూర్తి అన్నాడు.

''ఎస్ ... ఐ డోంట్ వాంట్ టు డిలే! నాకు 'నైట్ బ్లైండ్‌నెస్' ఉంది. కొంతమంది 'కలర్ బ్లైండ్‌నెస్' అని కూడా అన్నారు ... రాత్రిళ్ళు సరిగ్గా ... అంటే చీకట్లోమాత్రం కళ్ళు కనిపించవు ... దెరీస్ నో క్యూర్ ఫర్ దిస్ ... నా అర్హతలూ ... మా నాన్నిచ్చే ఆస్తీ ... అందం అన్నీ సరిపోయాయి గానీ, నా కున్న ఈ జబ్బుముందర అవన్నీ చాలా చిన్న క్వాలిఫికేషన్సని పెళ్ళికొడుకు లందరూ సర్టిఫై చేశారు. కాబట్టి అందర్లాగా మీరుకూడా మీ ఈ రెల్ఫ్ మీ డెసిషన్ వ్రాస్తాననడం కాదు...ఇక్కడే...ఇప్పుడే మీఅభిప్రాయాన్నే...''

మాలతి కళ్ళలో రెండు కన్నీటి బొట్లను చూసిన మధుమూర్తి విభ్రాంతి నుండి తేరుకొని చటుక్కున ఒక చేత్తో ఆమె పెదాల్ని, రెండో చేతితో ఆమె కన్నీటిని తుడిచాడు.

''మాలతీ ... నువ్వు నమ్ముతావో, లేదో కానీ నా కిది ఏభయ్యో పెళ్ళిచూపు !! దేవుడు నా కిన్నాళ్ళూ పెళ్ళి కాకుండా ఆపింది మనిద్దర్నీ ఇలా కలపాలనే! నేనూ నీ లాగే ఆదర్శానికి పోయి నా డిఫెక్ట్ గురించి అందరికీ చెప్పేవాణ్ణి ... కానీ, ఈ

ఎవరి ప్రాణ రక్షణకు అయినా కారణం అయ్యేది వారి కర్తవ్య నిర్వహణమే.

–జి. బి. ఎమర్సన్

రోజు నిన్ను చూడగానే ... ఏమైనా సరే నిన్నే చేసుకోవాలని, అసలు నువ్వు నా కోసమే పుట్టావని అనిపించింది! అందుకే నీ కా నిజాన్ని చెప్పకూడదనుకున్నాను! ఇప్పుడు ఆమోదించవలసింది నేను కాదు—నువ్వే...నీ నిర్ణయం మీదే మన భవితవ్యం ఆధారపడి ఉంది!''

మాలతి కళ్ళు ఆనందంతో మెరిశాయి. ''అయితే మీకు ... మీకు కూడా ...!'' ఆ పైన మాట్లాడలేకపోయింది.

''అవును మాలతీ! నాక్కూడా రేచీకటి బాగా ఉండేది మొన్న మొన్నటిదాకా ... ఇప్పుడు కాస్త నయం ఇదివరకటి కన్నా ... అసలు తలిదండ్రుల మాటెలా ఉన్నా పెళ్ళికూతుళ్ళయినా నన్నర్థం చేసుకొంటారు కదా అనుకున్న నాకు అందరూ నిరాశే కలిగించారు. జన్మలో పెళ్ళిచూపుల కెళ్ళకూడదనీ ... ఆడ పురుగు ఊసెత్త కూడదనీ అనుకున్నాను ... నా ఊహాకి నాకే నవ్వొచ్చింది. భగవంతుడు ఒక స్త్రీనిగాని, పురుషుణ్ణిగానీ పుట్టించాడంటే వాళ్ళకు తగ్గ జోడిని ఈ లోకంలో ఎక్కడో ... అక్కడ తప్పకుండా సృష్టించే ఉంటాడని నా కివాళే అర్థమైంది! అందుకే ... మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అండ్ ఫెర్‌ఫార్మ్‌డ్ ఆన్ ఎర్త్ అని ఆ మహానుభావు డన్నాడు!'' మధుమూర్తి గొంతు ఆర్ద్రమైంది.

''అస లీ లోకంలో లోపం లేని దెవరికి చెప్పండి, రచయితగారూ? అది సరేగానీ ముందు ఈ డన్‌హిల్ పాకెట్‌లో ఉన్నవన్నీ తనివితీరా కాల్చుకోండి .. మళ్ళీ ఆ తరవాత సిగరెట్ అన్నారంటే డైవర్సిస్తాను ... సిగరెట్టంటే అంత ఎలర్జీ నాకు!'' మాలతి నవ్వుతూ సిగరెట్ పాకెట్ అతని చేతిలో పెట్టి ఒక సిగరెట్‌ని పెదాల మధ్య ఉంచింది.

''అక్కర్లేదు ...చీకట్లో వెలుగుకోసం ... ఒంటరితనంలో తోడుకోసం ఇన్నాళ్ళూ ఈ సిగరెట్ కాల్చేవాణ్ణి. నా జీవితంలోకి వెలుగొచ్చింది. నా చీకటి తొలగిపోయింది. ఇంక ఈ సిగరెట్టెందుకు నాకు? ఇంతటితో దీనికి నే నిచ్చాను డైవర్సు!'' అని మధుమూర్తి మాలతిని ముద్దు పెట్టుకోబోయాడు.

''ఇంకా కొన్నాళ్ళు మీ ముద్దులు దాచుకోండి... ఆ రోజు వచ్చాక మీకు విసుగు వచ్చేంతవరకూ ముద్దులతో ముంచెత్తుదురు గాని ... పదండి మనం ఇవాళే శోభనం చేసుకుంటున్నామేమో అనుకునేరు పెద్దవాళ్ళు?'' మాలతి మాటలకి ఈ సారి పైకే గట్టిగా నవ్వేశాడు మధుమూర్తి. *



MCA-PDP-62-Tel-R